ప్రియుడు

[చిన్న కథ]

'ప్రయత్నించడానికి యున్నాళ్ళూ తనని అంధ కారగుహలో కూర్చోపెట్టిన ఆదర్శాలు యిటూ — అటు ఆపోకిరి భర్తా, కోతిముఖాల సంతానమూ అవకాశమిస్తే కదూ!'

రచయిత :

జనస్వామి కోదండరామశాస్త్రి

'వచ్చి చాలాసేపైంది. ఇక వెళతాను శ్యామా'

'అబ్బ! కూర్చోవే వెళుదువుగానిలే. ఎంతోకాలమైంది నిన్ను చూసి. మా అత్తింటికొచ్చి నువ్వు నన్ను చూసేదేలేదు. పుట్టింటికైనా వొచ్చినప్పుడు చూసిపోతూవుందువు. మన బాల్యస్నేహం అంతటితోనే పోనీయకు. నేను ఎప్పుడో నాలుగేళ్ళ క్రిందట యిక్కడకొచ్చినప్పుడు, కాస్సేపు మెరిసిపోయినావ్. మళ్ళీ అంతే. ఈ లోపల ఒకతడవ వొచ్చాను. అప్పుడు నువ్వూళ్ళో లేకపోయినావ్. పోతే, యీతడవ అప్పటి కప్పుడే నేనొచ్చి పదిరోజులైతే, నోరు తీపుపుట్టేలాగు కబుర్లుపంపగా, పంపగా దొరసానిగారి దర్శనం యిప్పటికి లభించింది. ఇప్పటికైనా మీ యింటి అయ్యగారి శలవు లభించిందా! లేక చాటుగా వొచ్చావా!...'

'ఇంకా చిన్నప్పటిమాటలు పోనిచ్చావు కాదే, శ్యామలా! స్నేహితురాల్ని చూసివస్తానంటే వారు మాత్రం ఒద్దంటారా ఏమిటే? ... మళ్ళీ రేపు సాయంకాలాన వస్తాన్లే.'

'ఒట్టూ?'

'నిజం, ఒట్టు'

తనని చూడడానికి వచ్చిన చిన్ననాటి సావాసగత్తె కనకాన్ని, వాకిలివరకూ పంపిద్దామని బయల్దేరింది శ్యామల కనకం వెనకనే ...వీధి గుమ్మంపై మెట్లులో శ్యామల పాదాలు అకాత్తుగా నిల్చిపోయినై ... గుండెల్లో ... వెంట్రుకలు గుబురుగా పెరిగివున్న ఆముఖంలోని...ఆ చూపు ... విషాదంగా...ఏడిచింది. బాధగా అరిచింది...వింత అనుభవములు మనసులో కదిలినై ... ముందు మెట్లుదిగుతూన్న కనకంతో ఏమిటో మాట్లాడుతోన్న కంఠం టక్కున ఆగిపోయింది.

మాట్లాడుతూ, మాట్లాడుతూ అకాత్తుగా పూరుకున్న శ్యామల వంక కనకం వెనక్కు తిరిగిచూసింది ఆఖరిమెట్టుపైన నిల్చొని. వెంటనే శ్యామల గమనించి ఆత్తరపాటును సర్దుకుంటూ నెమ్మదిగా అడిగింది: 'ఆ సందునే వెళుతూన్న ఆయ నెవరే' అని.

'అతనా ? గుర్తుపట్టలేదూ ? పాపం!...ఆవిధంగా మారిపోయాడు...చిన్నతనంలో మనమందరమూ ఆడుకుంటుండేవాళ్ళం...ఎరగవ్వూ ... నరసింహశాస్త్రి ... అతనే...'

హృదయాంతరతను దాచుకోవాలని చేసే శ్యామల ప్రయత్నం యీనూరి వ్యర్థమైంది. ఆమె గుండెల అదటు, ఆమె నేత్రాలలోనూ, కణతల్లోనూ ఛక్కగా ప్రతిబింబిస్తోంది. నిర్జనమైన ప్రతిమవలె కదలిక లేకుండా అట్లాగే నిలబడి, అతను నడిచి వెళుతోన్న సందులోకి చూస్తోంది అశ్రుపూరితనయనాలతో. కొన్నిమాసాలు అదే తీరుగా కూర్చుని రాత్రేగాని గ్రం

ధంగా తయారుకాలేని విషయాలూ, సంఘట్టనలూ, ఒక నిముసంలో గుంపులు గుంపులుగా మిలమిలా మెరిసినై మనోవీథిలో.

కనకం తిరిగి పై మెట్టుమీదకు శ్యామలకు దగ్గరగా వచ్చి వీపు చరుస్తూ అంది: 'ఏమిటో...పాపం...అట్లా మారిపోయాడు. ఎంత మందిచెప్పినా వినడు. సంసారమూ...భార్యా...అనే ధ్యాసేలేదు. యీ అయోమయుడితో వేగలేక ఆభార్య పుట్టింటి కెళ్ళిపోయింది... ఆముసలిముండ తల్లి వుందనుకుంటే ఆవిడ కాస్తా రాలిపోయి సంవత్సరం కావస్తోంది...ఇక ఇంకే?... వున్న ఆస్తిని అతని యిష్టంవచ్చినట్లు తగలేస్తున్నాడు.

ఎవరైనా 'బాబూ!ధర్మం'అని అడగడమే తడవు...చేతి కెంతొస్తే అంతే...ఎందువల్లనో పాపం...అతనిలో విరక్తి ఎక్కువై పోతోంది, శ్యామా!...జీవితాన్ని అమితనిర్లక్ష్యంగా వాడుకుంటున్నాడు...ఎంతో అవసరంవుంటే తప్ప, లేకపోతే ఎవరితోనూ మాట్లాడడు...ఆ ఇంటితలుపులు నాలుగూ లోపల గడియ వేసుకుని...లోపల...ఆ చిరుచీకట్లలో కూర్చొని ఏమి టేమిటో సణుక్కుంటాడట...ఎందుకో ఏడుస్తాడట...నవ్వుకుంటాడట...అస లీవూర్నుంచే లేచిపోవాలనిట ...ఆయిల్లూ, చెరువుదగ్గరి పొలమూకూడ బేరం పెట్టాడట. ఏముందే? అదీ జరుగుతుంది రేపో,మాపో...వెళ్ళొస్తాను శ్యామా!...మళ్ళీ రేపుసాయంకాలం... ఏం ... తప్పకుండా వస్తా...' అని ఆఖరిమెట్టునుంచి కిందకు దిగుతూ వాక్యం పూర్తి చేసింది.

వరండాలో ఎదురై 'మల్లెపూలు తెచ్చా నక్కయ్యా' అనే తమ్ముడిమాట తిన్నగా వినకుండా...కటకటలాడుతోన్న కణతల్ని గట్టిగా ఒత్తుకుంటూ గబగబా గదిలోకి వెళ్ళి...కాళ్ళగాటునున్న బాలీసుదిండు... తలగాటుకు సర్దుకుని...పందిరి మంచంపై ... అయిష్టంగానే వాలింది.

* * *

మర్నాటి సాయంత్రం కనకం వచ్చింది.

ఇద్దరూ మాటా, మంచీ కాస్సేపు మాట్లాడుకున్నారు.

శ్యామల చాలా నిరుత్సాహంగావుండడమూ— ఆమె నేత్రాలు ఎర్రగా యీలావున వాచివుండడమూ— పరధ్యాసగా, దిగులుగా, పదిమాటలకు ఒకమాట జవాబీయడమూ, ఇవన్నీ, కొంతసేపటిక్రితం కనకం,శ్యామవద్దకు వస్తూ బజార్లో శాస్త్రితరహాను చూచినప్పుడు నిర్ణయించుకున్న అభిప్రాయాన్ని బలపర్చినై —అయినప్పటికీ ఒకపక్కన శ్యామ తనతో చెప్పని రహస్యం వుండదనే అనుమానం గుంజుతూనేవుంది.

ఇట్లా అనుకుంటూనే, అకస్మాత్తుగా జ్ఞాపకంవచ్చినట్లు నటిస్తూ అందికనకం:'చూశావా,శ్యామా! నిన్న చూశామే... ఆశాస్త్రి... అతనికి ఇవ్వాళ్ళ పిచ్చెక్కింది. బజార్లంబడి వెర్రిగా పరుగులెత్తుతున్నాడు... దాయాలనుకున్న ఆఒక్కమాటా ఎక్కడ జారిపడుతుందో అని ఛటుక్కున వాక్ప్రవాహాన్ని ఆపేసింది.

ఈ మాటలువిని శ్యామ అదర్లేదు. బెదర్లేదు.

కాని, మాంసపుముద్దలవలెనున్న ఆరెండు నేత్రాలనుండి అశ్రుకణాలు వడివడిగా రాలుతున్నై బుగ్గలపైకి.

మోచేతులపై గడ్డంమోపుతూ శాంతంగానే అడిగింది శ్యామ: 'ఇంకా ఏమిటో చెప్పబోతూ ఆపేశావేం?' అని.

'ఆ...ఏముందే? పిచ్చివాళ్లు అనేకం వాగుతూంటారు.'

'ఏమన్నాడే! కనకం?'

'నాకు భయంవేసింది. ఏమిటో యిట్లా వాగుతాడని! ఎవరిపేరో; ఏమిటో. ఆపేరుగల వాళ్లు లక్ష మంది వుంటారు. ఇంకా ఇంటిపేర్లు కూడా వాగలేదు నయం.'

'ఏమిటే అసలుసంగతిచెప్పవ్?'

"'శ్యామా, నాశ్యామా'అని అరుచుకుంటూ వీధులలోబడి పరుగెత్తుతున్నాడు. ఆశ్యామ మరి ఎవరో; ఏమిటో పాపం!'

ఆమాట వినగానే శ్యామల అవురుమని ఏడిచింది.

కనకం, ఆమెకు ప్రక్కగా మంచంమీద జరిగి కూర్చుని ఆమెను ఒళ్ళోకి జార్చుకుని సాదరంగా తల నిమురుతూ 'ఊరుకో శ్యామా! ఎన్నడూ చెప్పావు కావేం? అసలు విషయం ఏమిటో' అని అన్నది.

'ఆ శ్యామను—అతని శ్యామను నేనే... నేనే... ఏమని చెప్పను కనకం?... పదిరోజులతోనే అంతమైపోయిన వైభవాన్ని గూర్చి ఏమని చెప్పను?... అదే మా ఇద్దరికీ నశింపులేని బంధమైపోయింది ...అతని జీవితాన్ని పాడుచేసింది. ...అతని తెలివితేటల్ని గంగలో కలిపింది... ఇరవై యేళ్ళు గడిచినా అది పాతపడ లేదు. సడలిపోలేదు. నవ్యకళలతో పుట్టిపడుతూ నేటికీ ఆ అగ్ని అతని గుండెల్లో ప్రచండంగా రగులుతూనేవుంది... అతని యీస్థితికి నేనే కారణం...యీ మాట నిశ్చయంగా నేను యిప్పుడు తెలుసుకున్నాను.'

'దుఃఖించకు శ్యామా!' అంటూ శ్యామను కనకం ఆదరించ గలిగిందే గాని తన కన్నీటినిమాత్రం అడ్డగించలేక పోయింది.

సింధూరవస్త్రాలంకరుడైన సూర్యభగవానుడ్ని దూరాన కొండ వెనుక ఏదో ఒక నిర్భేద్యమైన శక్తి కాళ్ళుపట్టుకుని కిందకు లాగేస్తోంది పాపం! శౌర్యమునూ. తీక్షణతనూ కోల్పోయిన ప్రభాకరుడు గిలగిలా కొట్టుకుంటూ కొండనానుకుని నిక్కి నిక్కి చూస్తున్నాడు,

చిన్న నీటిప్రవాహంలో నీడగా తేలిపోతూండే వులిపిరి తెల్ల కాగితం వలె ఆకాశపథాన కొద్ది కాంతితో మెల్లి మెల్లిగా ముందుకు సాగిపోతోన్న చంద్రబింబాన్ని చూస్తూ, తమ ఇళ్ళముందు దొడ్లలోనిల్చొని, ధాన్యపుధరకొమ్మనీ, బంగారుధర కొమ్మనీ, అది కాదని యిది, యిది కాదని అది, వివాదాల్లోకి దిగుతున్నారు పల్లెటూరి పెద్దమ్మలు.

అప్పుడే వికసించిన మల్లెపుష్పములవలె విడబడినాయి శ్యామల నేత్రములు. బద్ధకంగా లేచి కూర్చుని నలువైపులా చూచింది. కనకం లేదు, మరెవ్వరూ గూడా లేరు. ఎదుటి దొడ్లోంచి ఆవు పెయ్య బాధగా అరుస్తున్నట్లు మాత్రం వినిపించింది.

శ్యామ మనోవీధిలో అంతులేని ఆలోచనలు గుంపులు గుంపులుగా ధ్వనిస్తున్నాయి.

'తను నిజంగా ద్రోహికాదని ఎవరనగలరు?

'తనవాడు—తన సర్వస్వం—యిక్కడ యీవిధంగా అధోగతి పాలైపోతూంటే—తను అక్కడ—మంగళసూత్రం కట్టి తనపై సర్వాధికారాలూ సంపాదించుకున్న ఆ విశ్వాసహీనుడైన—తన 'భర్త' అని అందరిచేతా పిలిపించుకుంటూన్న— ఆయనతో ... ఆయనకు ఒంగి ఒంగి నమస్కరిస్తూ ...ఆయన ఆజ్ఞల్ని అక్షరాలా పాటిస్తూ... ఆయన కామదాహానికి ఒక కుళాయిగా వుపయోగపడుతూ...ఏ చోటా బలహీనపుబిడ్డ

లకు దుఃఖమయజీవితములను సృష్టిస్తూ...ఆ రోగాలకోరుతో ఏవేవో ఆదర్శాన్ని మనసులో వుంచుకు ఆత్మసంతృప్తి పొందుతూ ...కాపురంచేస్తూ కూర్చుంది .. యికముం దాపని చెయ్యలేదు తను ...ఏమైనా సరే...'

నూతోత్సాహంతో లేచి గదిలోకి నడిచింది శ్యామ. వెఱ్ఱి ఆనందంతో తన పెట్టెంతా కెలికింది. కొత్తది... కెంపురంగుచీరె పైకి లాగింది .... మల్లికాగుచ్ఛం ముడిచి జడచుట్ట నొక్కుకుంటూ ......అద్దంముందు నిల్చుని చూసుకుంటోంది...ఆహా! తను ఎంత సౌందర్యవతీ...యీ మాట తన ముప్ఫైయిఅయిదేళ్ళ జీవితంలోనూ యీ నాడు తెల్సుకుంది. అసలు అందుకు తను ప్రయత్నిస్తే గదూ? ప్రయత్నించడానికి యిన్నాళ్ళూ తనని అంధాకారగుహలో కూర్చోపెట్టిన ఆదర్శాలు యిటూ, అటు ఆపోకిరిభర్తా, కోటిముఖాల సంతానమూ అవకాశమిస్తేకదూ!

ఇప్పుడు తనని తను గుర్తించుకుంది. తన అందాన్ని గుర్తించుకుంది. లోకాన్నిగుర్తించింది—ఇదివరకు ఏపనులు చెయ్యడాన్ని గురించి ఆలోచించడానికైనా భయపడిందో, వాటిని యిప్పుడు తను తెగువగా చెయ్యగలుగు! వాటి సత్యస్వరూపములను విప్పి చూపగలుగు!

ఎంతసేపటినుంచీ కనకంగుమ్మం దగ్గిరి నిల్చునివుందో, ఏమో; శ్యామల తలయెత్తి చూసేసరికి, దగ్గిరకువస్తూ 'ఏమిటే! ఈశృంగారం. ఎక్కడకు ప్రయాణం' అని అంది నవ్వుతూ, శ్యామల తడుముకోకుండా, ఉత్సాహంగా జవాబుచెప్పింది 'నాప్రియుడి దగ్గిరకే...'

ఆమాటవల్ల కలిగిన ఆశ్చర్యంతో, రెండు నిముషాలపాటు అట్లాగే నోరు తెర్చుకుని నిలబడింది కనకం. తర్వాత— 'ఇంత సాహసమటే. లోకాన్ని చూసయినా—'

'హా— హా— హా— ఇటువంటి భయాలతోనూ, పిరికితనంతోనూ, ఆదర్శాలతోనూ, మూల కూర్చున్నాను కాబట్టే నాకింత ముసుక్కొచ్చింది. ఇక నన్ను ఏదీ ఆపలేదు. నన్ను నేనేఆపుకోలేను. ...'

చీరెకుచ్చెళ్లు కొంచెంపైకి పట్టుకుంటూ బయల్దేరింది శ్యామ. ఆమె వెనకనే కనకంగూడా ఏమీ మాట్లాడకుండా నడవ నారంభించింది.

కొంచెందూరం సాగి వెళ్ళిన తర్వాత, వెనకనుంచి ఆదుర్దాగా 'ఏమిటా పొగలు, మంటలు?' అని అన్నది కనకం.

'చూద్దాం. మనం ఆవైపుకే వెళుతున్నాంగా.'

జనంక్రిక్కిరిసివున్నారు. శాస్త్రి—అతనితోబాటు అతనియిల్లూ—దహనమై పోతున్నాడు. శ్యామల గబగబా పరుగెత్తుకుంటూ, అంతమంది జనంలోనూ తోసుకుని దారి చేసుకుంటూ మంటల్లోకి వెళ్ళిపోయింది.

ఆసుందరశరీరంలోని రక్తాన్ని ఇష్టంవచ్చినట్లు ఆరగిస్తూ, మత్తెక్కిపోయి ఆకాశాని కంటేలాగు గంతులేస్తున్నాడు అగ్నిహోత్రుడు.

కథల పుస్తకాలు

కారుణ్యం	0	4	0
—కొడవటిగంటి కుటుంబరావు			
రూమ్ టు లెట్	0	4	0
—పిల్లలమర్రి బాలకృష్ణశాస్త్రి			
స్వగతం	0	4	0
—కొడవటిగంటి కుటుంబరావు			
కలికి	0	4	0
—బొడ్డు బాపిరాజు			
బాపిష్యణికం	0	4	0
—గుడిపాటి వెంకటచలం			
యువ కథావళి	0	4	0
—వివిధ రచయితలు			
ఇల్లరికం	0	4	0
—కొడవటిగంటి కుటుంబరావు			
పాంచజన్యం	0	6	0
—చక్రపాణి			
బడదీదీ	0	4	0
—చక్రపాణి			
త్రిలోచన కవిరాజు	0	6	0
—చక్రపాణి			

ఆంధ్రభూమి బుక్ డిపో

వేపేరి : మదరాసు.